# కోనసీమ కులాల కురుక్షేత్రంలో ప్రజలు సమిధలు కారాదు

## అమరులు కందికట్ల నాగభూషణం, పెన్మత్స అనంతం, చింతం సత్యనారాయణదాసు, గుబ్బల వెంకటరెడ్డి నిర్మించిన వర్గపోరాట వారసత్వాన్ని గుర్తు చేసుకోవాలి

ప్రజల మధ్య ఉన్న కులాల వ్యత్యాసాలను కుమ్ములాటలుగా మార్చి, తద్వారా ప్రజలను ఓటు బ్యాంకులుగా సంఘటిత పరుచుకొనేందుకు పాలక, ప్రతిపక్ష పార్టీలు ఆడుతున్న రాజకీయ చదరంగంలో అంబేద్కర్ పేరు మరోసారి వాడబడింది. ఈ కుమ్ములాటలకు పాలక మేధావులు పెట్టిన ముద్దు పేరు "సోషల్ ఇంజనీరింగ్".

2022 ఏప్రిల్ 3న కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా కోనసీమ జిల్లా ఏర్పడింది. అప్పటినుంచి జనసేన, టిడిపిలు డిమాండ్ చేస్తున్నాయి కనుక అంబేద్కర్ పేరును కలిపి కోనసీమ అంబేద్కర్ జిల్లాగా పేరు మారుస్తూ 19-5-2022న ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అలా ఇవ్వడంలో అధికార పార్టీకి దానికి ఉండాల్సిన దురుద్దేశాలు దానికి ఉన్నాయి. కోనసీమకు అంబేద్కర్ పేరు కలిపి పెట్టటాన్ని స్పష్టంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు వ్యతిరేకిస్తున్నాయి. వెంటనే దళిత వ్యతిరేక సామాజిక సమీకరణలకు బిజెపి పూనుకొన్నది. కోనసీమలో ఎప్పటినుండో భూస్వామ్య, పెత్తందారులలో ఒక స్థానం సంపాదించుకొన్న బిజెపి ఇప్పుడు కులతత్వాన్ని రెచ్చగొట్టటం ద్వారా తన స్థానాన్ని మరింత విస్తరించుకోదలచుకొంది. మతతత్వానికి సహకరిస్తూనే మైనారిటీలకు చిట్టిపొట్టి సంస్కరణలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అంతిమంగా మతోన్మాద శక్తులకు దేశాన్ని అప్పగించిందో, అదే విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రతిపక్ష పార్టీలు అంతిమంగా రాష్ట్రాన్ని మతోన్మాదులకు, కులోన్మాదులకు అప్పగించే పనులు చేపడుతున్నాయి. ప్రజలను సంక్షోభ సుడిగుండాలలోకి తోస్తున్న వీరే, ప్రజలు కులాల కుమ్ములాటలలో మునిగి తమలో తాము కలహించుకొంటూ, అసలు దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా పోరాడకుండా చేయాలనుకొంటున్నారు.

కోనసీమ అంటే మూడు వైపులా గోదావరి నది, ఒక వైపు సముద్రం మధ్య సుదీర్ఘకాలం బయటి ప్రాంతాలతో నిరంతర సంబంధాలకు దూరంగా ఉన్న ప్రాంతం. 1920ల నాటి భూముల రీసర్వే వల్ల భూమి పన్నులు కట్టలేక రైతులు భూములను కోల్పోతే, వడ్డీ వ్యాపారుల నుండి, సాంప్రదాయ భూస్వాములకు తోడుగా కొత్త భూస్వాములు తయారయ్యారు. భూస్వామ్య పీడన కుల అణచివేతతో కలసి తీవ్రంగా అమలు జరిగిన ప్రాంతం. పీడిత కులాల లోపలే వైమానశ్యాలు, విభేధాలు తీవ్రంగా కొనసాగేవి. ఇలాంటి స్థితిలో కమ్యూనిస్టు పార్టీ నిర్మించిన భూస్వామ్య అగ్రకుల ఆధిపత్యాన్ని ధిక్కరించే వర్గపోరాటంలో క్రమంగా పీడితులంతా కలిసిపోయారు. ఈ విధంగా 1940-50ల నాటికి నాటి కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన అనేక వర్గపోరాటాలలో ఒకే వర్గంగా, పీడిత వర్గంగా ఏకమయ్యారు. నాటి కమ్యూనిస్టు ఉద్యమం పీడిత ప్రజలను వర్గ ఉద్యమాలలో ఐక్యం చేస్తూ, దళిత కులాల మధ్య ఉన్న; దళితులు, వెనుకబడిన కులాల మధ్యనున్న కుల వైమనస్యాలను తొలగిపోయేలా చేసింది. దళితులపై సాగుతున్న అన్ని రకాల ఆర్థిక, సాంఘిక దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా సమీకరించింది. ప్రభుత్వం వేలాదిమంది పోలీసులతో తీవ్ర నిర్బంధం అమలు జరిపిందంటే నాటి ఉద్యమం భూస్వామ్య పెత్తందార్ల ఆర్థిక, కుల పెత్తనాన్ని ఎంతగా దెబ్బకొట్టిందో అర్థం చేసుకోవచ్చు. అప్పటి షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వ్యవసాయ కార్మికోద్యమానికి ప్రత్యామ్నాయంగా పుట్టినప్పటికీ,కమ్యూనిస్టు పార్టీ వారి దృక్పథాల విషయంలో విమర్శనాత్మకంగా ఉంటూనే, అగ్రకుల పెత్తందార్లకు వ్యతిరేకంగా వారు చేసిన ఆందోళనల్లో వారికి అండగా నిలబడింది. నాటి అన్ని రంగాలలో జరిగిన కృషి ఫలితంగా అనేక మంది కార్యకర్తలు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహించే నాయకులయ్యారు. తమ కులాల పరిధులు దాటి ప్రజలందరి నాయకులయ్యారు. కామ్రేడ్స్ కందికట్ల నాగభూషణం, పెన్మత్స అనంతం, చింతం సత్యనారాయణదాసు, గుబ్బల వెంకటరెడ్డి, నండూరి సుబ్బారావు, తోరాటి లక్ష్మణమూర్తి, ప్రేరేపి మృత్యుంజయుడు, వంటి నాయకులు తూర్పు గోదావరి నుంచి పోలీసు దమనకాండలో అమరులైనారు. ఆ కాలపు శత్రుదాడి నుంచి రక్షించుకొన్న నాయకులు కామ్రేడ్స్ కానేటి మోహనరావు, భూపతి నారాయణమూర్తి, సాకా వెంకటరావు వంటి కామ్రేడ్స్ అనంతర కాలంలో ఉద్యమాన్ని కొనసాగించారు. అయితే కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన అతివాద, మితవాద పెడధోరణుల ఫలితంగా కాలక్రమంలో ఉద్యమం వెనుకపట్టు పట్టింది. అప్పటివరకూ కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు ఇచ్చిన వర్గ చైతన్యం, నిర్మాణం అన్న రాజకీయ ఆయుధాన్ని పీడిత ప్రజలు కోల్పోయారు. క్రమంగా సంస్కరణలు, ప్రలోభాల క్రమంలో పాలక వర్గాలు ప్రజలపై తమ ప్రాబల్యాన్ని పెంచుకొన్నాయి. క్రమంగా పీడితకులాల నుంచి ఉనికిలోకి వచ్చిన కులసంఘాలు, వాటి నాయకత్వాలు కూడా భూస్వాముల, అగ్రకుల సంపన్నుల ప్రాబల్యంలోకి వెళ్లిపోయాయి. వర్గ చైతన్యం, స్పృహ వెనుకపట్టు పట్టటంతో

రిపబ్లికన్ పార్టీ వంటి పార్టీలు సైతం కనుమరుగైపోయాయి. పీడిత మధ్యతరగతి ప్రజలలో ఓడించబడ్డ భూస్వామ్య పెత్తందారీ అగ్రకుల, మతతత్వ శక్తులు ఆర్ఎస్ఎస్ రూపంలో తిరిగి క్రమంగా బలం పుంజుకొన్నాయి. క్రాప్ హాలిడే ఉద్యమాలు, అంతర్వేది రథం దగ్ధం ఘటనలు వీటికి ఉదాహరణలు. కోనసీమలో కౌలు దోపిడీ, కూలి దోపిడీ, వడ్డీ దోపిడీ, మార్కెట్ దోపిడీ వంటి అన్ని దోపిడీ రూపాయలకు తోడు రిలయన్స్ వంటి కార్పొరేట్ సంస్థల దోపిడీ పీడనలు యదేచ్ఛగా సాగుతున్నాయి. సహజ సంపదలు, శ్రమ సంపదలు ధారాళంగా కొల్లగొట్ట బడుతున్నాయి. కొయిట (గల్ఫ్) దేశాలలో తీవ్రమైన శ్రమ దోపిడీకి, పీడనలకు గురౌతున్నది వీరే..

ఈనాడు దోపిడీ శక్తులందరూ పీడిత ప్రజలు పోరాడి సాధించుకొన్న హక్కులను, సాంస్కృతిక విలువలను కాలరాయాలని పూనుకొంటున్నారు. పీడిత ప్రజల మధ్య, కుల, మతాల మంటలను మండిస్తున్నారు. కొన్ని పాలకవర్గ పార్టీలు పైకి లౌకికతత్వం గురించి, ప్రజల ఐక్య పోరాటాల గురించీ ఇంకా ఎన్నెన్నో చెప్పినప్పటికీ దోపిడీ వర్గాల యొక్క మరిన్ని నిరంకుశ విధానాలకు, వాటికి ప్రాతినిధ్యం వహిస్తున్న మితవాద అభివృద్ధి నిరోధక శక్తులకు అనుకూల భూమికను ఏర్పరుస్తున్నాయి.

కోనసీమకు అంబేద్కర్ పేరుపెట్టినంత మాత్రాన దళిత పీడిత ప్రజల జీవితాలపై సాగుతున్న దోపిడీ పీడనలు తొలగిపోవు. దళిత పీడిత ప్రజలు వర్గ చైతన్యాన్ని పెంపొందించుకొని, సంఘటిత నిర్మాణాలకు మరలడమే సమాజంలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణులను అంతిమంగా తిప్పికొట్టగలదు. అదే సమయంలో అంబేద్కర్ పేరుతో ఆధిపత్య శక్తులు రెచ్చగొడుతున్న దళిత వ్యతిరేకతను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తిరస్కరించాలి. లౌకిక, ప్రజాతంత్ర శక్తులు రాష్ట్రంలో, ప్రత్యేకించి కోనసీమలో జడలు విప్పుతున్న కులతత్వ, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సమైక్యంగా నిలబడాలి. పీడిత ప్రజలు, వర్గ చైతన్య స్పృహను నిలబెట్టుకోవాలి. నిన్న మొన్నటి అమలాపురం సంఘటనలు చేస్తున్న హెచ్చరిక ఇది.

*****